PRGI: TGTEL/26/A6429

# యువ వెలుగు

తెలుగు దిన పత్రిక

E- Paper, www.yuvavelugu.com

యువ వెలుగు తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

మండలం | నియోజకవర్గం | జిల్లా వారీగా రిపోర్టర్లు కావలెను

9908 502 602

సంపుటి : 01 సంచిక : 38 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | ఆదివారం 11-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-

## ఉత్తరాఖండ్‌ను వణికించిన మరో భూకంపం




- ఉత్తరకాశీలో 4.2 తీవ్రతతో ప్రకంపనలు
- శనివారం ఒక్కరోజే రెండుసార్లు కంపించిన భూమి
- బాగేశ్వర్‌లోనూ స్వల్ప తీవ్రతతో భూకంపం
- కొద్దిరోజుల క్రితం చమోలీలోనూ కంపించిన ధరణి

- వివరాలు 2లో



# ప్రపంచ మార్కెట్‌పై తెలంగాణ కన్ను

### సన్న బియ్యం ఎగుమతికి ప్రణాళికలు

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 10 :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పండుతున్న మేలురకం సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లోని కొనుగోలుదారులతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవడంపై దృష్టి సారించింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 'అంతర్జాతీయ ప్రపంచ వరి సదస్సు (ఐడబ్ల్యుఆర్‌సీ) 2026'లో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాలను స్పష్టం చేసింది. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, తెలంగాణ బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ రిటైలర్లు, ఫుడ్ కంపెనీలు, ఎగుమతిదారులను ఆహ్వానించారు. కేవలం దేశీయంగా మిగులు నిల్వలను నిర్వహించడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక విలువను సృష్టించడంపై దృష్టి సారించామని ఆయన వివరించారు. దేశీయ ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు. గత సీజన్‌లో తెలంగాణలో 18.5 మిలియన్ టన్నుల ⏭ తరువాయి 2లో..

# ఢిల్లీలో హై టెన్షన్

## మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్

### ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్
- అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం

2లో



# తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు

- ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన తొమ్మిది రోజుల ఉత్సవాలు
- సంప్రదాయ వస్త్రాల్లో మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 10 :** తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ ⏭ తరువాయి 2లో..

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికి తీస్తున్నామని వెల్లడి



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 10 :** తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు.

రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ⏭ తరువాయి 2లో..




### రిగ్గింగ్ ఆధారాలుంటే చూపండి..

# ఈసీకి మద్దతుగా మాజీ ఉన్నతాధికారుల ఘాటు లేఖ

**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ఎన్నికల ప్రక్రియలపై ప్రతిపక్షాలు చేస్తున్న 'రిగ్గింగ్' ఆరోపణలపై 124 మంది విశ్రాంత ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘాన్ని సమర్థిస్తూ, భారత పౌరులను ఉద్దేశించి వారు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల అక్రమాలపై చేసే ఆరోపణలకు కచ్చితమైన ఆధారాలు ఉండాలని, నిరాధార ఆరోపణలతో ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. 'ఓట్ల చోరీ' జరుగుతోందంటూ ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న తరుణంలో ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో శనివారం జరిగిన ఆందోళనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ అధికారులు స్పందిస్తూ, "మేం ఏ రాజకీయ పార్టీకి చెందినవాళ్లం కాదు. దశాబ్దాల పాటు మా సర్వీసులో ఎన్నికల నిర్వహణను దగ్గరుండి చూశాం. ఓటర్ల జాబితా రూపకల్పన నుంచి ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వరకు క్షేత్రస్థాయిలో పనిచేశాం. ఎటువంటి ఆధారాలు లేకుండా 'రిగ్గింగ్' అనే ⏭ తరువాయి 2లో..

# 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది' : ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

- ఢిల్లీలో ఆంక్షలు విధించడంపై కాంగ్రెస్ అభ్యంతరం
- యువత నిరసన హక్కును అడ్డుకుంటున్నారని ఆరోపణ
- మోదీ, అమిత్ షాలపై ప్రియాంకా విమర్శలు
- ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న జైరాం రమేశ్



**ఢిల్లీ :** ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్న వారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని ⏭ తరువాయి 2లో..

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్

## భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 10 :** హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె ⏭ తరువాయి 2లో..



# కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి: బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 10 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన ⏭ తరువాయి 2లో..



## ఘనంగా పిఏసీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సం



**లింగాలఘణపురం, యువ వెలుగు, అక్టోబర్ 10 :** ఈరోజు లింగాలఘణపురం మండల కేంద్రంలో పిఏసీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివకుమార్) ఈ కార్యక్రమంలో డిసిఓ కరుణ , పిఏసీఎస్ చైర్మన్ మల్ల శ్రీశైలం , సీఈఓ శ్రీనివాస్, సర్పంచ్ ఎడ్ల లావణ్య రాజు, ఎఎంసి డైరెక్టర్లు బుట్రెడ్డి శ్రీలత రెడ్డి, నీలం మోహన్, ఏఈవో స్పందన గారు, గ్రామశాఖ అధ్యక్షుడు బెజ్జం ఆంజనేయులు, రాజా రవీందర్ రెడ్డి, భృగు మహర్షి,గవ్వల మల్లేశం,కారంపూడి చంద్రయ్య,మంద శ్రీధర్ రెడ్డి,అఫ్జల్ , కడకంచి రవి,కుంటి బీమయ్య, రామచందర్, ఫ్యాట యాకయ్య, ఎడ్ల వీర నర్సింహులు,యూత్ నాయకులు ఎర్ర క్రాంతి మరియు హమాలి సంఘం నాయకులు రైతులు,యువకులు, పిఏసీఎస్ సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## కడవెండి గ్రామంలో ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు



**దేవరుప్పుల మండలం, యువ వెలుగు, అక్టోబర్ 10 :** తెలంగాణ సాంప్రదాయాలకు ప్రత్యేకంగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా కడవెండి గ్రామ ప్రజలందరికీ ముఖ్యంగా మన ఆడబిడ్డలకు అక్క చెల్లెళ్లకు మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు పువ్వులను పూజిస్తూ పకృతిని అందిస్తూ తెలంగాణ ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పే బతుకమ్మ పండుగ ప్రతి ఇంట్లో ఆనందాన్ని ప్రతి కుటుంబంలో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయుష ఆరోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మీ యువ వెలుగు జవరుప్పుల జనగాం జిల్లా రిపోర్టర్ పడమటింటి ఏసు పాదం.



## సమగ్ర భూ సర్వేలో అసైన్మెంట్ మరియు ఇనాం భూములకు ప్రాధాన్యత ఇవ్వాలి

### మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

**జనగాం యాదగిరి మాదిగ :** కాంగ్రెస్ అధికార పార్టీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే అభినందనీయం అని కొనియాడారు . భూ కబ్జాలకు గురైనటువంటి పేదలలైనా దళితుల భూములు వెలికి తీయాలి. SC లకు పంచిన ప్రభుత్వ భూములను పట్టాలుగా మార్చడానికి చట్ట సవరణ చేయాలని, దానికి సంబంధించిన జీవోలను ప్రవేశ పెట్టాలని కోరారు.




ఎప్పటికైనా కాంగ్రెస్ పాలనలోనే నిరుపేదలైన దళితులకు న్యాయం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. మాదిగలను పట్టించుకొని ఏ రాజకీయ పార్టీలు మనుగడలో లేవని.. ప్రస్తుత అధికార ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ SC కార్పొరేషన్‌ను పునరుద్ధించాలని రిక్వెస్ట్ చేశారు.

# ఢిల్లీలో సీజేపీ నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై రాళ్ల దాడి

**న్యూఢిల్లీ :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన కార్యక్రమం ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిరసనలో పాల్గొనేందుకు వస్తున్న ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అరెస్ట్ చేసిన నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై జన్‌దేవాలన్ ప్రాంతంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడటం కలకలం రేపింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అదుపులోకి తీసుకున్న కొందరు కార్యకర్తలను పోలీసులు బస్సులో తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో కొందరు నిరసనకారులు పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించడమే కాకుండా, బస్సును ధ్వంసం చేసేందుకు కూడా యత్నించారు. అయితే, పోలీసులు వారిని వెంటనే నియంత్రించి, నిర్దేశిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనతో జన్‌దేవాలన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సీజేపీ పిలుపు మేరకు జంతర్ మంతర్ వద్దకు చేరుకుంటున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో శనివారం దేశ రాజధాని వ్యాప్తంగా 1,000 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, నిరసనకు ముందే సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే, అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా గురుగ్రామ్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. సుమారు 50 మంది పోలీసులు మఫ్టీలో వచ్చి ఉదయం 8 గంటలకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సీజేపీ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది.

గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా చట్టపరమైన ఆదేశాలను, ఇచ్చిన హామీలను సీజేపీ నిర్వాహకులు పాటించనందున, ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించినట్లు పోలీసులు శుక్రవారమే స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

## ప్రపంచ మార్కెట్‌పై తెలంగాణ కన్ను

(మొదటి పేజీ తరువాయి)

వరి ఉత్పత్తి జరిగిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగిన సన్న, మేలురకం బియ్యాన్ని బ్రాండెడ్, ట్రేసబుల్ (ఎక్కడ పండిందో గుర్తించే వీలున్న) పద్ధతిలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు 30,000 టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన అనుభవంతో ఈ కొత్త ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.

**పెరుగుతున్న దేశీయ ధరలు, మిల్లర్ల ఆందోళన**

ఒకవైపు ప్రభుత్వం ఎగుమతులపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 'సన్న బియ్యం' పీడీఎస్ పథకం కింద ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం, కొన్ని జిల్లాల్లో వరి సాగు తగ్గడం, ఎల్ నినో ప్రభావంపై ఆందోళనల కారణంగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గింది. దీంతో కొద్ది వారాల క్రితం కిలో రూ.70 ఉన్న సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.80-82కి చేరింది. 25 కిలోల బస్తా ధర రూ.2,150 సమీపంలో పలుకుతోంది.

ఇదే సమయంలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సేకరణ వ్యయం అధికంగా ఉండటంతో ఎగుమతుల్లో పోటీని తట్టుకోలేకపోతున్నామని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. థాయ్‌లాండ్, వియత్నాం నుంచి తక్కువ ధరకే బియ్యం అందుబాటులో ఉండటం మధ్యప్రాచ్యం, పశ్చిమాఫ్రికా మార్కెట్లలో భారత బియ్యంపై ప్రభావం చూపుతోందని వారు పేర్కొంటున్నారు. అయితే, దేశీయ అవసరాలు, రైతుల నుంచి ధాన్యం సేకరణకు తొలి ప్రాధాన్యం ఇస్తూనే ఎగుమతి అవకాశాలను అన్వేషిస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'

### ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

## ఈసీకి మద్దతుగా మాజీ ఉన్నతాధికారుల ఘాటు లేఖ

(మొదటి పేజీ తరువాయి)

పదాన్ని ఎన్నికలపై విసరడం మనందరి ప్రజాస్వామిక విశ్వాసాన్ని గాయపరుస్తుంది," అని లేఖలో పేర్కొన్నారు. గతంలోని పరిస్థితులను గుర్తుచేస్తూ, "రిగ్గింగ్ ఎన్నికలు ఎలా ఉంటాయో మాకు బాగా తెలుసు. ఒకప్పుడు సినిమాల్లో చూపించినట్లు బూత్‌ల వద్ద కత్తులు, బాహుబలుల దౌర్జన్యాలు, బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లడం వంటివి చూశాం. బూత్ కబ్జాలు సర్వసాధారణం కావడంతో 1989లో పార్లమెంట్ దీన్ని తీవ్రమైన నేరంగా ప్రకటించింది" అని వివరించారు. నేటి ఎన్నికల వ్యవస్థ పటిష్ఠతకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనమని వారు తెలిపారు. "ఒకప్పుడు బూత్ కబ్జాలకు మారుపేరైన బిహార్‌లో 2025 ఎన్నికల్లో ఒక్కచోట కూడా రీ-పోలింగ్ జరగలేదు. ఇది ఆ రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం. 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. మహిళలు రికార్డు స్థాయిలో ఓటేశారు. ఇది అధికారులు సాధువులుగా మారడం వల్ల జరగలేదు. ఈసీ రూపొందించిన పటిష్ఠ వ్యవస్థ వల్లే సాధ్యమైంది" అని ప్రశంసించారు.

ప్రస్తుత ప్రక్రియలో ప్రతి బూత్‌లోనూ అభ్యర్థుల ఏజెంట్లు ఉంటారని, పోలైన ఓట్లపై సంతకాలు చేసి పత్రాలు తీసుకుంటారని, ఏజెంట్ల సంతకాలతోనే మెషీన్లను సీల్ చేసి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారని వివరించారు. రిగ్గింగ్ జరగాలంటే వివిధ రాజకీయ పార్టీల ప్రభుత్వాలకు చెందిన వేలాది మంది అధికారులతో పాటు, ఓడిపోయిన పార్టీల ఏజెంట్లు కూడా మౌనంగా ఉండాలని, అంత పెద్ద కుట్ర ఎప్పటికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను ఉద్దేశించి "మీరు రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తున్న వ్యవస్థే మీకు గతంలో విజయాలను అందించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. మీరు వ్యవస్థను అనుమానిస్తున్నారా? కేవలం ఫలితాన్ని మాత్రమేనా? ప్రజలచే తిరస్కరణకు గురైన తర్వాత నిరాధార ఆరోపణలతో ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా తమ ఉనికిని కాపాడుకోవాలని చూడటం సరికాదు" అని వారు ఘాటుగా విమర్శించారు.

## ఢిల్లీలో హై టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు.

ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు: మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెం డింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

## హైదరాబాద్ హైస్పీడ్ రైల్

(మొదటి పేజీ తరువాయి)

హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం.

మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది.

ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

## కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి: బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.

## తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు నిర్వహించారు. నేడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు, అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం ఉంటుంది. ఈ ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు.

## ఉత్తరాఖండ్‌ను వణికించిన మరో భూకంపం

**ఉత్తరాఖండ్ :** ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు.

ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.

# రైతుల పొలాలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాల్సిందే -ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**అక్బర్‌పేట-భూంపల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రైతు ధర్నా**

**రైతులకు విద్యుత్ కోతల నుంచి తక్షణమే ఉపశమనం కల్పించాలి**

**సాగునీరు,ఉచిత విద్యుత్ అందించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం విడనాడాలి**



**దుబ్బాక, అక్బర్‌పేట, భూంపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 10 :** దుబ్బాక నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర విద్యుత్ కోతలను నిరసిస్తూ, వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ దుబ్బాక ఎమ్మెల్యే శ్రీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అక్బర్‌పేట--భూంపల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ భారీ రైతు ధర్నా నిర్వహించింది. రైతుల పంటలను కాపాడాలని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగునీరు అందక పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని, రాత్రివేళల్లో కూడా విద్యుత్ కోసం రైతులు పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల వ్యవసాయ మోటార్లు, విద్యుత్ పరికరాలు దెబ్బతింటున్నాయని, రైతులకు అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు సాగునీటి సమస్యలను పరిష్కరించి రైతుల పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతాంగానికి అండగా నిలుస్తుందని, అవసరమైతే రైతుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, సర్పంచులు, పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని నినాదాలు చేశారు.

# విశ్వశాంతిలో వైభవంగా బతుకమ్మ సంబరాలు




**సత్తుపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 10 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను శనివారం సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం రంగురంగుల పూలతో, బతుకమ్మ పాటలతో పండుగ శోభను సంతరించు కుంది. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మ లను ఒకచోట చేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై మనకున్న ప్రేమకు ప్రతీక అని తెలిపారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలను పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. నేటి తరం విద్యార్థులు మన పండుగల విశిష్టతను తెలుసుకుని, వాటి విలువలను భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల్లో ఐకమత్యం, సోదరభావం, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంలో ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ ఖానాపూర్ మండల యూత్ అధ్యక్షుడిగా కాసారపు శ్రీనివాస్




**ఖానాపూర్, యువ వెలుగు, అక్టోబర్ 10 :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఖానాపూర్ మండల యూత్ అధ్యక్షుడిగా కాసారపు శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్ లొ తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కాసారపు శ్రీనివాస్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు లోకిని రాము కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు లోకిని రాము, నిర్మల్ నియోజకవర్గ ఇన్ చార్జ్ డాక్టర్ చంద్రప్రకాష్, మీర్జా భాయ్, గంగారాం, రాజన్న, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైన్ బో స్కూలులో దసరా ఉత్సవాలు



**మాడ్గుల, యువ వెలుగు, అక్టోబర్ 10 :** కొత్త బ్రాహ్మణపల్లి రైన్ బో పాఠశాలలో బతుకమ్మ సంబరాలు మరియు దుర్గామాత నవదేవతలను చిన్నారుల రూపంలో పూజించి ఆ దేవతలకు హారతులు ఇచ్చి సాంప్రదాయం బద్ధంగా ముందస్తు దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు పండుగల విలువ దాని వెనకాల దాగి ఉన్న జ్ఞాన సంపద తెలుసుకోవాలని భవిష్యత్తులో ఆచరిస్తేనే మన దేశ చరిత్ర, సాంప్రదాయాలు భద్రంగా ఉంటాయని డైరెక్టర్ మంతాపురం జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బంది ప్రిన్సిపాల్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో వేడుకలు జరుపుకున్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ - మున్సిపల్ చైర్మన్

**నాంపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 10 :** ముందస్తు బతుకమ్మ సంబరాలను నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ విద్యాసంస్థల్లో శుక్రవారం నాడు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు,గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి మరియు సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని,ఈ పండుగను తెలంగాణ ఆడపడుచులు వారి పుట్టింటిలో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ బంధాలు మరియు అనుబంధాలను గుర్తు చేసుకుంటూ ఆడపడుచులు తొమ్మిది రోజులపాటు పూలతో గౌరీదేవిని పూజిస్తారని, మహాలయ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమై చివరి రోజు సద్దుల బతుకమ్మగా ముగుస్తుందని తెలిపారు. విద్యార్థినులు మహిళా ఉపాధ్యాయులు సాంప్రదాయ వస్త్రధారణతో, పూలతో అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల బతుకమ్మలతో పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. బతుకమ్మ పండుగ పర్యావరణాన్ని ఆదరించే ఆచారానికి ప్రతీక అని పేర్కొన్నారు. సత్యం చెడుపై గెలిచే విజయదశమి సందేశం చక్కగా వివరించారు. గౌరీ మాత వేషధారణలో ఉన్న చిన్నారులు ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్లు కర్నాటి నాగరాజు,సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సామల వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# దుబ్బాక డిపోలో బాణం విజయకేతనం



**దుబ్బాక, యువ వెలుగు, అక్టోబర్ 10 :** కార్మికుల ఐక్యతకు ఎన్నికల ఫలితం అద్దం పట్టింది. హోరాహోరీగా సాగిన పోరులో బాణం గుర్తు విజయాన్ని అందుకుంది. దుబ్బాక ఆర్టీసీ డిపోలో జరిగిన యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ ఆరు ఓట్ల ఆధిక్యంతో గెలుపొందింది. ఈ విజయాన్ని ఆర్టీసీ కోసం ప్రాణాలర్పించిన 32 మంది అమర కార్మికులకు అంకితం చేస్తున్నట్లు దుబ్బాక డిపో గౌరవాధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డిపోలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 126 మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాణం గుర్తుకు 66 ఓట్లు రాగా, నిచ్చెన గుర్తుకు 60 ఓట్లు పోలయ్యాయి. దీంతో తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్‌పై తెలంగాణ వర్కర్స్ యూనియన్ విజయం సాధించింది.

**ఆరు ఓట్ల ఆధిక్యంతో వర్కర్స్ యూనియన్ గెలుపు**

**32 మంది అమర కార్మికులకు విజయాన్ని అంకితం చేసిన మచ్చ శ్రీనివాస్**

**అమరుల త్యాగానికి అంకితం**

ఈ సందర్భంగా మచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దుబ్బాక డిపో కార్మికులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. అశ్వద్ధామ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో కార్మికులు బాణం గుర్తుకు ఓటు వేసి యూనియన్‌ను గెలిపించడం సంతోషంగా ఉందన్నారు. ఈ విజయాన్ని ఆర్టీసీ కోసం పోరాడి అమరులైన 32 మంది కార్మికులకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

**డిపో అభివృద్ధికి ప్రత్యేక కృషి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తామని మచ్చ శ్రీనివాస్ తెలిపారు. దుబ్బాక డిపోకు అదనంగా మరో పది బస్సులు తీసుకురావడంతో పాటు శాశ్వత డిపో మేనేజర్‌ను నియమించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలిచి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ డిపో అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక డిపో అధ్యక్షుడు దొడ్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి ఏ. మహేందర్‌రెడ్డి, కోశాధికారి యాదబాబు, ఆర్టీసీ కార్మికులు మంతూరి రమేష్, ఎండీ అజీముద్దీన్, బిక్షపతి, పెంటీ బాలకిషన్, తిరుపతి, ఆశయ్య, పెద్ద ముత్యం, రవి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, సిద్ధిరాంరెడ్డి, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై అపోహలు సృష్టించడం సరికాదు

**అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలి..**

**లోపాలుంటే సరిదిద్దాలి**

**ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి**

**బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద రెడ్డి**



**వికారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 10 :** ఎస్ఐఆర్ ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని, దేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ ప్రస్తుత పరిస్థితులపై బాధ్యతాయుతంగా ఆలోచించాలని బీజేపీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు టి.సదానంద రెడ్డి అన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా రాజకీయ పార్టీలు వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దాలని, అంతేకానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అర్హులైన పౌరుల ఓటు హక్కు తొలగిపోకుండా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనర్హంగా ఓట్లు తొలగించినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే, బాధితులకు తమ ఓటు హక్కును తిరిగి పొందే అవకాశం కల్పించాలని అన్నారు. పట్టణ వార్డులు, గ్రామాల స్థాయిలో అర్హులైన ఓటర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌరులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల్లో మార్పులు, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఉంచుతూ, న్యాయ ప్రక్రియకు ఆటంకం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అయితే ఆ హక్కును శాంతియుతంగా, చట్టపరిధిలో వినియోగించుకోవాలని సదానంద రెడ్డి పేర్కొన్నారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, అనవసర ఉద్రిక్తతలకు కారణమయ్యే విధంగా వ్యవహరించడం వల్ల సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. చర్చలు, ఆధారాలు, చట్టపరమైన పోరాటాల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానాలపై అభ్యంతరాలు ఉన్న రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజల మధ్యకు వెళ్లి తమ అభిప్రాయాలను వివరించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతు పొందడం, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని అధికారంలోకి రావడం ప్రజాస్వామ్యంలో ఉన్న మార్గాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం కావాలని అన్నారు. దేశ ఐక్యత, శాంతిభద్రతలు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సదానంద రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



**సూర్యాపేట/తుంగతుర్తి, యువ వెలుగు, అక్టోబర్ 10 :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజా మోహన్ రావు మాట్లాడుతూ బతుకమ్మ సంస్కృతికి ప్రత్యేక ఇది ప్రకృతిని పూలను స్త్రీ శక్తిని ఆరాధించే పండగ పేర్కొన్నారు దీనిలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్1&2 ప్రోగ్రాం ఆఫీసర్స్ పి నాగయ్య పి ప్రవీణ్ కుమార్ అధ్యాపకులు నగష్ భగత్ సింగ్ దయాకర్ సంతోష్ పుల్లయ్య అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రఘునాథపాలెంలో జూద స్థావరంపై పోలీసుల దాడి

**9 మంది అరెస్ట్.. రూ.15,200 నగదు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం**



**మఠంపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 10 :** మఠంపల్లి మండల పరిధిలోని రఘునాథపాలెం గ్రామ శివారులో జూదం ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మఠంపల్లి ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి జూద స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.15,200 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టారు. జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# ఎక్సైజ్ అధికారుల దాడులు బెల్లం పటిక స్వాధీనం



**కొడకండ్ల, యువ వెలుగు, అక్టోబర్ 10 :** ప్రాబిషన్ అండ్ ఎక్సైజ్ పాలకుర్తి సి ఐ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులలో కొడకండ్ల గ్రామానికి చెందిన బొమ్మెర బోయిన యాకయ్య కిరాణం షాపు లో అక్రమంగా అమ్ముతున్న 160 కే జీ బెల్లంను,20 కే జీ పట్టికను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఎవరు ఐన అక్రమంగా బెల్లం, పటికను అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని సి ఐ ఎక్సైజ్ హెచ్చరించారు. ఈ దాడుల్లో సి.ఐ. బాలాజీ నాయక్, ఎస్.ఐ. అఖిల్ కుమార్,హెడ్ కానిస్టేబుల్ వీరయ్య, కానిస్టేబుల్స్ నాగరాజు, సురేష్, కరుణాకర్, నాగమ్మ పాల్గొన్నారు.

# మాజీ సింగిల్ విండో డైరెక్టర్ వెంకటయ్య మృతి




**మాడ్గుల, యువ వెలుగు, అక్టోబర్ 10 :** గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మెట్టు వెంకటయ్య గౌడ్ శనివారం ఉదయం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటయ్య మృతి పట్ల సర్పంచ్ ముదేంటి రజిత దేవయ్య గౌడ్, ఉపసర్పంచ్ సూదిని శరత్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాట్ల యాదయ్య గౌడ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటయ్య గౌడ్ మృతి బాధాకరమని కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నల్గొండ జిల్లా కలెక్టర్




నల్లగొండ, యువ వెలుగు, అక్టోబర్ 10 : సమాచార హక్కు చట్టాన్ని నల్గొండ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లా అధికారులు ,పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల కృషి వల్లనే జిల్లాకు అవార్డు వచ్చిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1) బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకుగాను శుక్రవారం జిల్లా కలెక్టర్ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్ల చేతులమీదుగా అవార్డుతో పాటు, జ్ఞాపికను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని అధికారులు , సిబ్బంది, ఆయా శాఖలలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేస్తున్న పి ఐ ఓ లు, ఏపీఐవోల కృషి వల్లనే ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. అలాగే సమాచార హక్కు చట్టం కింద కేసులను పరిష్కరించడంలో కూడా నల్గొండ జిల్లా రాష్ట్రంలో 2 వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అధికారులందరూ ఇంకా బాగా పని చేస్తే కేసుల పరిష్కారంలో మొదటి స్థానంలో నిలుస్తామని, ఆ విధంగా అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని ఆయన కోరారు.

# రైతుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి : ఎమ్మెల్యే పాయల్ శంకర్

## బాధిత రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25000 ఆర్థిక సహాయం



తలమడుగు, యువ వెలుగు, అక్టోబర్ 10 : జిల్లాలో రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు.ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం, తలమడుగు గ్రామానికి చెందిన రైతులు కాడే లక్ష్మణ్, గుర్రాల ప్రతాప్ మృతి నేపథ్యంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నర్సయ్యతో కలిసి బాధిత రైతు కుటుంబాలను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తన వంతు సహాయంగా బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25000ల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పంట నష్టాలు, వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు, కౌలు వ్యవసాయంలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందుల కారణంగా రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంట చేతికి రాక,అప్పుల భారం భరించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని అన్నారు.రైతులకు పంట నష్టాల నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను అమలు చేస్తోందని, ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనిశ్చితంగా ఉన్న ప్రస్తుత తరుణంలో పంటల బీమా రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో సుమారు రూ.3,000 కోట్లు కేటాయించినప్పటికీ, పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, బాధిత రైతు కుటుంబాలకు క్షమాపణ చెప్పడంతో పాటు వారికి తక్షణమే తగిన ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇందులో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, దేవర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుజ్ఞా రెడ్డి, శ్రీ చంద్రశేఖర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్రీ కట్కం రాందాస్, రత్నాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మార్కెట్ కమిటీల సమస్యల పరిష్కారానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సానుకూల స్పందన



**చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన దుబ్బాక నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్లు**

దుబ్బాక, యువ వెలుగు, అక్టోబర్ 10 : దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్లు రాష్ట్ర వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను, మార్కెట్ల అభివృద్ధికి అవసరమైన చర్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధి, మార్కెట్ కమిటీల బలోపేతం తదితర అంశాలపై మంత్రితో చర్చించి, సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్లు పలు సమస్యలను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. మార్కెట్ కమిటీల సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునే దిశగా మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధి, మార్కెట్ కమిటీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ భేటీ జరిగినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ (అమర్) రెడ్డి,దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి, చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ తాడెం వెంగళరావు, దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలపొరం కనకయ్య,మిరుదొడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ సంయుక్త శ్రీధర్ గుప్తా, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కమలాకర్ దుబ్బాక నియోజకవర్గం బిఎల్ఎ కో ఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి,జిల్లా కార్యదర్శి ఇప్ప మల్లేశం, బేగంపేట్ సర్పంచ్ చందు,మాజీ మండల అధ్యక్షులు సుధాకర్, మాజీ సర్పంచ్ గడిల జనార్దన్ రెడ్డి, నర్సింగ్ మండలం నాయకులు రాజేష్, మాజీ సర్పంచ్ మధు, మాజీ సర్పంచ్ ప్రతాప్,మున్సిపల్ నాయకులు గోపాల్ రెడ్డి, దండబోయిన శ్రీను, ఆనందం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు మున్సిపాలిటీలో ఉపాధి హామీ అమలుకు సంతకాల సేకరణ



చెన్నూరు, యువ వెలుగు, అక్టోబర్ 10 : చెన్నూరు మున్సిపాలిటీలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో కోటబోడలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేదలకు స్థానికంగా ఉపాధి లభించక అప్పులపాలై, కుటుంబ పోషణ కోసం వలస వెళ్లాల్సి వస్తోందన్నారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత ఉపాధి హామీ పథకం అమలు నిలిచిపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు.వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పుట్ట కృష్ణమాచారి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పునరుద్ధరణతో పాటు 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల పాటు సంతకాల సేకరణ చేపడుతున్నామని, పేదలు, కార్మికులు, ఉపాధి కూలీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు భోగి సత్యం, సామల ఉమారాణి, భూపెల్లి మణి, రైతు సంఘం మండల కార్యదర్శి కుందారపు చంద్రన్న, భోగి నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుడి వినూత్న ఆలోచన

- పది రూపాయల నాణాలతో స్కూటీ కొనుగోలు
- మూడేళ్ల పాటు నాణాల సేకరణ
- రూ.లక్ష 23 వేల, పది నాణాలు చెల్లింపు



లక్సెట్టిపేట, యువ వెలుగు, అక్టోబర్ 10 : లక్సెట్టిపేట పట్టణంలో ఓ వ్యక్తి కేవలం 10 రూపాయల నాణెములు చెల్లించి కొత్త స్కూటీ హోండా యాక్టివాను కొనుగోలు చేయడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. ఆ వినియోగదారుడు వినూత్నంగా స్కూటీ కొనుగోలు చేసిన తీరు అందరిని ఆలోచింప చేయడమే కాకుండా ఆసక్తికరంగా మారింది. పట్టణంలోని ఓ హోండా షోరూమ్ లో శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వడ్ల వాడకు చెందిన రవి జోసెఫ్ అనే వ్యక్తి ఓ స్కూటీని కొనుగోలు చేశారు. స్కూటీ కొనుగోలు చేయడం మామూలే అయినప్పటికీ సదరు వ్యక్తి స్కూటీకి అవసరమైన లక్ష 23 వేల రూపాయల ను కేవలం పది రూపాయల నాణాల రూపంలో చెల్లించాడు. అక్కడ ఉన్న టేబుల్ పై మొత్తం పది రూపాయల నానాలను అందంగా అలంకరించి పెట్టడంతో షోరూం నిర్వాహకులు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా పది రూపాయల నాణాలను ఆయన సేకరించాడు. ఈ నానాలతో ఏదైనా వినూత్నంగా చేయాలని అనుకున్నాడు. అంతే షో రూమ్ లోకి వెళ్లి తనకు ఇష్టమైన హోండా యాక్టివా 125 సిసి ని కొనుగోలు చేసి లక్ష ఇరవై మూడు వేల విలువైన పది రూపాయల నాణాలను షోరూం వారికి అందజేశాడు. పది రూపాయల నాణాలతో స్కూటీని కొనుగోలు చేయడం పట్టణంలో ఆసక్తికరంగా మారడమే కాకుండా చర్చనీయాంశంగా మారింది.

# అంగన్వాడీ చిన్నారులకు వార్డు సభ్యుడి సహకారం



జన్నారం, యువ వెలుగు, అక్టోబర్ 10 : జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం నంబర్-1కు గ్రామ ఏడవ వార్డు సభ్యుడు బోర్లకుంట శివశంకర్ కుర్చీలు, గోడ గడియారాన్ని బహూకరించారు. అంగన్వాడీ చిన్నారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో తనవంతు సహకారం అందించారు. చిన్నారుల సౌకర్యార్థం వస్తువులను అందించిన శివశంకర్‌ను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జాడి సంజీవరాణి, ఆయా మమత, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, మల్లయ్య, వెంకట్, రాజన్న, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో చోళ చీఫ్స్ బోణీ

హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 10 : ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో చోళ చీఫ్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కాకతీయ నైట్స్‌పై 6-2తో గెలిచింది. కొలంబియా ఆర్చర్ అలెజాండ్రా ఉస్కియానో సంధించిన ఎనిమిది బాణాలూ పర్ఫెక్ట్ 10 పాయింట్లు సాధించడం విశేషం. రిషభ్ యాదవ్, ఉస్కియానో అద్భుత ప్రదర్శనతో చోళ చీఫ్స్ తొలి రెండు సెట్లను గెలిచి 4-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో సెట్‌ను నీరజ్ చౌహాన్ రాణించడంతో కాకతీయ నైట్స్ గెలుచుకున్నా, నిర్ణయాత్మక నాలుగో సెట్‌లో దీపికా కుమారి, మార్కస్ డిఅల్మేడా రాణించడంతో చోళ చీఫ్స్ విజయం ఖరారైంది.

# చెత్త వేరు చేయకపోవడంపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం



సిద్దిపేట జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 10 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది రోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు వస్తుంటారని, అలాంటి ప్రదేశంలో చెత్తను సక్రమంగా వేరు చేయకుండా నిల్వ చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా, వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా మూడు రకాలుగా వేరు చేయడం తప్పనిసరని స్పష్టం చేశారు. వేరు చేసిన చెత్తను సంబంధిత మున్సిపల్ వాహనాలకు అందించాలని, ఆసుపత్రి పరిసరాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యా నికి సంబంధించిన విషయంలో నిర్లక్ష్యం సహించేది లేదని, చెత్త నిర్వహణలో ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, చెత్త సేకరణ, వేరు చేయడం, తరలింపు ప్రక్రియలను పర్యవేక్షించాలని శానిటరి అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడానికి సంబంధించిన సమస్యపై మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డా. సంగీత, జిల్లా వైద్యాధికారి డా. ధనరాజు, ఆర్ఎంవో డా. శ్రావణి తదితర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇకపై ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివకుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రమాదం జరిగితేనే మేల్కొంటారా?

## ప్రధాన రహదారిపై ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లు.. అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

## సర్పంచ్ పలుమార్లు విన్నవించినా స్పందించని విద్యుత్ అధికారులు



ముత్తారం, యువ వెలుగు, అక్టోబర్ 10 : ముత్తారం-మంథని ప్రధాన రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రహదారికి అతి సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో పాటు వాటి చుట్టూ రక్షణ కంచె లేకపోవడం వాహనదారులు, పాదచారులకు ప్రమాదకరంగా పరిణమిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై ఇలాంటి పరిస్థితులు నెలకొన్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ముత్తారం మండల కేంద్రంలో నెలకొన్న ఈ సమస్యను గ్రామ సర్పంచ్ పలుమార్లు సంబంధిత విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా మండల సర్వసభ్య సమావేశంలోనూ ఈ ప్రమాదకర పరిస్థితిని ప్రస్తావించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రజాప్రతినిధులు సమావేశాల్లో సమస్యను ప్రస్తావించినా అధికారులు స్పందించకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రధాన రహదారికి సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటం, వాటి చుట్టూ రక్షణ కంచె లేకపోవడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు అదుపు తప్పినా, పాదచారులు పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్ల సమీపానికి వెళ్లినా ప్రమాదం జరిగే ముప్పు ఉంది.ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా?**

ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే,ముందుగానే ప్రమాద నివారణ చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత కాదా?రహదారికి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఇప్పటికైనా రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు,ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని,స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రైవేట్ స్కూల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



అడవిదేవులపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 10 : మండల కేంద్రంలోని రిషి కాన్సెప్ట్, శ్రీ గౌతమి, తేజ కాన్వెంట్ స్కూల్లో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు మన పండుగలు, సంస్కృతి యొక్క ప్రాముఖ్యతను తెలియజేసేందుకే పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను ముందస్తుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటువంటి వేడుకల ద్వారా పిల్లల్లో మన సాంప్రదాయాల పట్ల అవగాహన గౌరవం పెరుగుతాయని అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణంలో కోలాహలం సృష్టించారు. పిల్లల విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ శ్రీనివాస చారి, రమావత్ ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు శంకర్, నాగ సైదులు, వెంకన్న, రాజేశ్వరి, అన్వర్, వీణ, జోగ్య, జ్యోతి, పార్వతి, మౌనిక, షాఫీనా, పావని, లక్ష్మీ, మాధవి, సుహాసిని, మహేశ్వరి విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**Editor P. Mahesh Goud,** Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : **9908 502 602**